విద్యుత్ సమస్య ఏర్పడితే..

చందానగర్ ఏడీఈ శ్యాంరావు:	8332872962
హఫీజ్‌పేట్ సబ్‌స్టేషన్ ఏఈ ఇంద్రసేనారెడ్డి:	8985564147
చందానగర్ సబ్‌స్టేషన్ ఏఈ రాజేందర్:	9440813167
వేమన కాలనీ సబ్‌స్టేషన్ ఏఈ శ్రీనివాస్‌రెడ్డి:	8985564919
తారానగర్ సబ్‌స్టేషన్ ఏఈ సుమన్:	9440156725
ఫ్యూజ్ ఆఫ్ కాల్ 24/7:	9490153510

కూరగాయల ధరలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో .. టమాట 30, పచ్చిమిర్చి 60, బెండ 50, కాకర 60, దొండ 50, దోస 40, ఆలు 40, చామ 60, కీర 40, బీర 70, వంకాయ 40, గోకర 60, బీన్స్ 150, బీట్‌రూట్ 40, క్యాప్సికమ్ 80, క్యాబేజీ 40, క్యారెట్ 60, చిక్కుడు 90, ఉల్లి 25(కేజీ), ములక్కాయలు (2)10 , క్యాలీఫ్లవర్ (1) 30, సొరకాయ (కేజీ) 30, అల్లం 160, వెల్లుల్లి 270.

వినతి

శేరిలింగంపల్లి: ఇంటి నిర్మాణం కోసం తీసిన గుంతల్లో నీరు నిండి తన ఇంటి ప్రహరీ గోడ కూలిందని, వారిపై చర్యలు తీసుకోవాలని శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్‌కు సుదర్శన్‌నగర్ నివాసి శంకరయ్య వినతిపత్రం అందజేశారు. సుదర్శన్‌నగర్‌లో తమ ఇంటి పక్కన కొత్త భవనం నిర్మాణం దృష్ట్యా గోతులు తీసారని అందులో వరద నీరు చేరి తమ గోడ కూలిందని వివరించారు. గుంతల వల్ల ప్రమాదం జరిగే అవకాశాలు ఉన్నాయని న్యాయం చేయాలని జోనల్ కమిషనర్‌ను కోరారు.

వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం



కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని గంధంగూడ శ్రీ జ్ఞాన వేంకటేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ఆలయ ఆవరణలో స్వామి వారి కల్యాణాన్ని నిర్వహించారు. ఆలయాన్ని పూలు, రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామి వారి కల్యాణాన్ని తిలకించారు. మధ్యాహ్నం ప్రసాద వితరణ చేశారు.

వాహనాలు తీసుకెళ్లాలి.. లేదంటే వేలం

సైబరాబాద్ పోలీసు అధికారులు

రాయదుర్గం: సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో వివిధ సందర్భాలలో పట్టుబడిన వాహనాలకు సంబంధించి యజమానులు తగిన పత్రాలు సమర్పించి వాహనాలను తీసుకెళ్లాలని లేదంటే ఆ వాహనాలను వేలం వేయనున్నట్టు సైబరాబాద్ పోలీసు అధికారులు తెలిపారు. మొయినాబాద్ పోలీస్‌స్టేషన్ గ్రౌండ్స్‌లో 522 వాహనాలను చట్ట ప్రకారం వేలం వేయాలని నిర్ణయించారు. వాహనానికి సంబంధించిన యజమానులు ఎవరైనా అభ్యంతరం కలిగి ఉంటే నోటిఫికేషన్ తేదీ నుంచి ఆరు మాసాల వ్యవధిలో సైబరాబాద్ కమిషనరేట్ కార్యాలయంలో తమ క్లెయిమ్ చేయాలి .వాహనాల వివరాలు మొయినాబాద్ పోలీస్‌స్టేషన్ గ్రౌండ్‌లో రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ ఎంటీఓ–2 ఎన్ వీరలింగం సెల్ నంబర్ 9490617317లో సంప్రదించాలి. అంతేకాకుండా సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ వెబ్‌సైట్‌లో కూడా వివరాలు అందుబాటులో ఉన్నాయని వివరించారు.

'సండే ఈవినింగ్ టాక్'

రాయదుర్గం: బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని శాంతిసరోవర్‌లో ఆదివారం 'సండే ఈవినింగ్ టాక్' కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. సాయంత్రం 6.30 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు 'సక్సెస్ మంత్రాస్' అనే అంశంపై ద్రోణాచార్య అవార్డు గ్రహీత, జాతీయ అథ్లెటిక్స్ కోచ్ రమేష్ నాగపూరి ప్రత్యేక ఉపన్యాసం చేస్తారు. మరిన్ని వివరాలకు ఫోన్ నెంబర్ 040–23001234లో సంప్రదించాలని నిర్వాహకులు సూచించారు.

చెట్ల కొమ్మలను తొలగించరా..?



దీప్తిశ్రీనగర్ కాలనీలో రోడ్డు పక్కన చెట్లకొమ్మలు

మియాపూర్ : మియాపూర్ ప్రాంతంలో పలు కాలనీల ప్రధాన రహదారుల్లో చెట్లకొమ్మలతో స్థానిక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గత వారం పడ్డ వర్షాలకు ఈదురు గాలులకు చెట్ల కొమ్మలు విద్యుత్ తీగలపై విరిగిపడ్డాయి.దీంతో విద్యుత్ సిబ్బంది జేసీబీ సహాయంతో చెట్ల కొమ్మలను తొలగించి రోడ్ల పక్కన వేశారు. వారం రోజులు గడిచినా చెట్లకొమ్మలను అధికారులు తొలగింప చేయలేదు. మియాపూర్, చందానగర్ ప్రాంతాల్లోని పలు కాలనీలలో చెట్లకొమ్మలు రాకపోకలకు అడ్డంకిగా మారాయి. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

కారు బోల్తా



జిన్నారం(పటాన్‌చెరు): జిన్నారం మండలం ఖాజీపల్లి గ్రామంలో గురువారం కారు బోల్తా పడింది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. ఖాజీపల్లి గ్రామానికి చెందిన జీవన్ అనే వ్యక్తి కారులో వస్తుండగా నారాయణ కాలేజీ నుంచి ఖాజీపల్లి మధ్యలో వేసిన సీసీ రోడ్డుకు ఇరువైపులా మట్టి పోయకపోవటంతో ప్రమాదకరంగా మారింది. జీవన్ కారు అదుపుతప్పటంతో రోడ్డుపై పక్కనున్న గుంతలో పడింది. ఈ ఘటనలో జీవన్‌కు స్వల్ప గాయాలయ్యాయి. సీసీ రోడ్డుకు ఇరువైపులా మట్టి పోయించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

రిటైనింగ్ వాల్ నిర్మించండి

- వర్షాకాలం వస్తోంది.. నాలా ముంపు లేకుండా చూడండి
- వ్యర్థాలతో పూడుకుపోతున్న నాలా

హఫీజ్‌పేట్ : చందానగర్ డివిజన్ పరిధిలోని గంగారం చెరువు నుంచి వచ్చే నాలాలో రిటైనింగ్ వాల్ పనులు అసంపూర్తిగా ఉన్నాయి. దీంతో పలువురు అందులో భవన నిర్మాణ వ్యర్థాలు, చెత్తాచెదారం వేస్తున్నారు. వాస్తవానికి చందానగర్‌లోని అన్నపూర్ణ కాలనీ, వేముకుంట మీదుగా వెళుతున్న నాలాలో పూడికతీత పనులు చేపట్టారు. అయితే రిటైనింగ్ వాల్ పనులు మధ్యలో నిలిచిపోయాయి. వ్యర్థాల కారణంగా ఓపెన్ నాలా కాస్త అండర్ గ్రౌండ్ డ్రైనేజీలాగా మారిపోయింది.వర్షాకాలం వస్తున్న నేపథ్యంలో ఇప్పటికైనా జీహెచ్‌ఎంసీ అధికారులు నాలాను విస్తరించడంతో బాటు రిటైనింగ్ వాల్ నిర్మించి వరద ముంపు నుంచి కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.



చందానగర్ డివిజన్ పరిధిలోని వేముకుంట వద్ద నాలాలో చెత్త చెదారం, చెట్లు



నాలా పక్కనే వేసిన భవన నిర్మాణ వ్యర్థాలు



పనులు ప్రారంభించాలి



రిటైనింగ్ వాల్ పనులు వెంటనే ప్రారంభించి పూర్తయ్యేలా అధికారులు దృష్టి సారించాలి. రానున్న వర్షాకాలంలో వరద ముంపు రాకుండా ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేయాలి.

\- మహేశ్వర్‌రెడ్డి, చందానగర్

వ్యర్థాలు వేయకుండా చూడాలి



నాలాలో చెత్తాచెదారం, భవన నిర్మాణ వ్యర్థాలు వేయకుండా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలి. నాలా వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని పూడికతీత పనులు పూర్తి చేయాలి.

\- తిమ్మారెడ్డి, చందానగర్

రోడ్లపై వరద నీరు నిల్వకుండా చర్యలు



గచ్చిబౌలిలోని ఎస్కీ రోడ్డులో పనులను పరిశీలిస్తున్న డీఈ విశాలాక్షి తదితరులు

రాయదుర్గం: రెండు గంటల పాటు భారీగా కురిసిన వర్షానికి పలుచోట్ల రోడ్లపైకి వరదనీరు వచ్చి చేరింది.దీంతో జీహెచ్‌ఎంసీ అధికారులు రోడ్లపై ఎక్కడా నీరు నిలవకుండా చర్యలు చేపట్టడంతో వాహనదారులకు ఇక్కట్లు లేకుండా సాఫీగా రాకపోకలు సాగించారు. గచ్చిబౌలిలోని ప్రధానరోడ్డు మార్గంలో ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా ముందు, బయోడైవర్సిటీ పార్కు కూడలి, గచ్చిబౌలి నుంచి రాయదుర్గం వరకున్న రోడ్డుపై ఎక్కడా నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టారు. వెస్ట్‌జోన్ జోనల్ కమిషనర్ స్నేహ శబరీష్, డిప్యూటీ కమిషనర్ రజనీకాంత్‌రెడ్డి ఆదేశాలపై డిప్యూటీ కమిషనర్ విశాలాక్షి ఆధ్వర్యంలో జీహెచ్‌ఎంసీ సిబ్బంది చర్యలు చేపట్టారు.

సీఆర్ ఫౌండేషన్‌లో ఉచిత కంప్యూటర్ శిక్షణ

హఫీజ్‌పేట్: కొండాపూర్‌లోని సీఆర్ ఫౌండేషన్ నీలం రాజశేఖర్‌రెడ్డి రీసెర్చ్ సెంటర్‌లో మహిళలకు ఉచిత కంప్యూటర్ శిక్షణ కేంద్రం నిర్వహిస్తున్నారు. మహిళలకు స్వయం ఉపాధి కోసం టైలరింగ్, ఎంబ్రాయిడరీ, మగ్గం, డైయింగ్, ప్రింటింగ్, బ్యూటీషియన్, స్పోకెన్ ఇంగ్లిష్, కంప్యూటర్, ట్యాలీ, డీటీపీ తదితర శిక్షణను ఉచితంగా అందిస్తున్నారు. సంవత్సరానికి నాలుగు బ్యాచ్‌లుగా, ఒకొక్క బ్యాచ్‌కు మూడు నెలల పాటు శిక్షణ ఉంటుంది. ఒక బ్యాచ్‌లో సుమారు 100 మంది మహిళలు ఉంటారు. 15 సంవత్సరాల వయస్సు నుంచి 35 సంవత్సరాల మధ్యలో గల చిన్నారులు, మహిళలు ఈ శిక్షణలో పాల్గొనవచ్చు. మరిన్ని వివరాలకు ప్రిన్సిపల్ జోస్యభట్ల కల్పన ఫోన్ : 9603196925లో సంప్రదించవచ్చు.

25 నుంచి ట్రిపుల్‌ఐటీ సమ్మర్ స్కూల్

- పీఎల్ఎఫ్, హైసియాతో కలిసి నిర్వహణ
- నాలుగు వారాలపాటు 'ప్రొడక్ట్ మేనేజ్‌మెంట్'

రాయదుర్గం: ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్ కొత్తగా ప్రొడక్ట్ మేనేజ్‌మెంట్ సమ్మర్ స్కూల్‌ను ప్రకటించింది. ప్రొడక్ట్ లీడర్స్ ఫోరమ్ (పీఎల్ఎఫ్) హైదరాబాద్ సాఫ్ట్‌వేర్ ఎంటర్‌ప్రైజెస్ అసోసియేషన్ (హైసియా)తో కలిసి నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ మూడు సంస్థలు కలిసి నాలుగు వారాల ప్రొడక్ట్ మేనేజ్‌మెంట్ సమ్మర్ స్కూల్‌ను ప్రారంభించినట్లు గురువారం ప్రకటించాయి. ఇందుకోసం రిజిస్ట్రేషన్లు తెరిచి ఉంచారని మే 25 తేదీ నుంచి ప్రారంభం కానుంది. ఇందులో ప్రోగ్రామ్ ప్రొడక్ట్ మేనేజర్లు, డెవలప్‌మెంట్ మేనేజర్లు, ఆర్కిటెక్టులు, ఔత్సాహిక ఉత్పత్తి మేనేజర్లు, స్టార్టప్ వ్యవస్థాపకులను లక్ష్యంగా చేసుకొని ఏర్పాటు చేశారు.

కార్పొరేటర్ పర్యటన

పటాన్‌చెరు టౌన్: సీసీ రోడ్డు, మ్యాన్ హోల్ నిర్మాణంలో నాణ్యత పాటించని కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ మెట్టుకుమార్ యాదవ్ అన్నారు. గురువారం పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని గోకుల్‌నగర్‌లో పర్యటించారు. వర్తక సంఘం వద్ద నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డులో నాణ్యత పాటించలేదని,దీంతో ఇంట్లోకి వర్షపు నీరు వస్తున్నాయని, అదేవిధంగా మ్యాన్‌హోల్స్ కూడా సరిగా నిర్మించలేదని స్థానికులు కార్పొరేటర్ దృష్టికి తీసుకువచ్చారు. దీంతో ఆయన రోడ్డు సీసీ రోడ్డును,మ్యాన్ హోల్స్‌ను జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి పరిశీలించారు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో ప్రజలు ఇబ్బందిపడుతున్నారని ఈ విషయంపై అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.

డెంగ్యూ నివారణపై అవగాహన ర్యాలీ



ర్యాలీని ప్రారంభించిన మెడికల్ ఆఫీసర్ డా.చందర్ తదితరులు

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్, జీహెచ్‌ఎంసీ ఎంటమాలజీ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో గురువారం డెంగ్యూ నివారణపై అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఈ ర్యాలీని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ చందర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శుభ్రమైన వాతావరణం డెంగ్యూ నివారణ మార్గమని, ప్రతి శుక్రవారం డ్రై డేగా పాటించాలని సూచించారు. రానున్న వర్షాకాలంలో పరిసరాల శుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని కాలనీవాసులకు సూచించారు. దోమలతో అనేక వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని, అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ ర్యాలీ గుల్‌మొహర్‌పార్కు కాలనీ నుంచి లింగంపల్లి రైల్వే స్టేషన్, పీజేఆర్ స్టేడియం వరకు కొనసాగింది. కార్యక్రమంలో సీహెచ్‌ఎ స్వామి, పీహెచ్‌ఎన్ శ్యామల, ల్యాబ్ టెక్నీషియన్ సత్యనారాయణరెడ్డి, శేరిలింగంపల్లి సర్కిల్ అసిస్టెంట్ ఎంటమాలజిస్ట్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

వర్షం.. ఇబ్బందులు

మాదాపూర్‌లోని నెక్టార్ గార్డెన్ వద్ద, సిటీ వైన్స్ ప్రాంతంలో..





మాదాపూర్: మాదాపూర్‌లోని పలు ప్రాంతాలలో కురిసిన వర్షానికి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ట్రాఫిక్ జాం కావడంతో మాదాపూర్ ట్రాఫిక్ సీఐ నర్సయ్య, సిబ్బంది క్లియర్ చేశారు. ప్రధాన కూడళ్ల వద్ద మ్యాన్‌హోల్స్‌ను తీయడంతో కొంతమేర నీరు తగ్గింది. మాదాపూర్‌లోని సిటీ వైన్స్, నెక్టర్ గార్డెన్ వద్ద, జంక్షన్‌ల వద్ద వరదనీటితో ఇబ్బందులు పడ్డారు.

పోక్సో కేసులో యువకుడికి పదేళ్ల జైలు

- బాధితురాలికి రూ.5 లక్షల పరిహారం
- రాజేంద్రనగర్ ఫాస్ట్‌ట్రాక్ స్పెషల్ కోర్టు తీర్పు



నిందితుడు కట్ల సతీష్‌కుమార్ రెడ్డి

గచ్చిబౌలి: పెళ్లిపేరుతో మాయ మాటలు చెప్పి బాలికను నమ్మించి అఘాయిత్యానికి పాల్పడిన ఓ నిందితుడికి పదేళ్ల జైలు శిక్ష విధిస్తూ రాజేంద్రనగర్ ఫాస్ట్ ట్రాక్ స్పెషల్ కోర్టు తీర్పు వెలువరించింది. గచ్చిబౌలి ఇన్‌స్పెక్టర్ ఎస్.ఆంజనేయులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నాగర్‌కర్నూల్ జిల్లా లట్టుపల్లికి చెందిన కట్ల సతీష్‌కుమార్‌రెడ్డి(23) డ్రైవర్‌గా పనిచేస్తూ మల్లాపూర్‌లో నివాసం ఉంటున్నాడు. లట్టుపల్లికి చెందిన బాలిక(15)తోపాటు తల్లిదండ్రులు బతుకుదెరువు కోసం గౌలిదొడ్డికి వచ్చారు. ఈ క్రమంలో ఆ బాలికతో అతడు తరచూ ఫోన్‌లో మాట్లాడేవాడు. ఈ క్రమంలో పెళ్లి చేసుకుంటానని మాయమాటలతో నమ్మించి, ఇంటి నుంచి బయటకు తీసుకెళ్లి అత్యాచారానికి పాల్పడ్డాడు. దీంతో బాధితురాలి తల్లిదండ్రులు జూలై 2017లో గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన అప్పటి ఎస్‌హెచ్‌ఓ గంగాధర్, ఏసీపీ చంద్రకాంత్ చార్జ్‌షీట్ దాఖలు చేశారు. ఈ మేరకు రాజేంద్రనగర్ ఫాస్ట్ ట్రాక్ స్పెషల్ కోర్టు జడ్జి పి.ఆంజనేయులు గురువారం తీర్పు వెలువరించారు. నిందితుడికి పదేళ్ల జైలుశిక్ష, రూ.8 వేలు జరిమానా విధించారు. బాధితురాలికి ప్రభుత్వం రూ.5 లక్షల నష్టపరిహారం చెల్లించాలని తీర్పులో పేర్కొన్నారు.

హైలైఫ్ ఎగ్జిబిషన్ ప్రారంభం



ప్రముఖ డిజైనర్లు రూపొందించిన వస్త్రాభరణాలు సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. మాదాపూర్‌లోని హెచ్ఐసీసీలో గురువారం హైలైఫ్ ఎగ్జిబిషన్‌ను నటి ఆశురెడ్డి, వర్ష, అమిక్షలు ప్రారంభించారు. మూడు రోజుల పాటు నిర్వహించనున్న ఆ ప్రదర్శనలో వివాహాది శుభకార్యాలకు ప్రత్యేక డిజైన్‌లు అందుబాటులో ఉన్నాయని నిర్వాహకులు తెలిపారు. నగరయువతను అకట్టుకునేలా సమ్మర్ స్పెషల్ వస్త్రాలు అందుబాటులో ఉన్నాయని నిర్వాహకులు డొమినిక్ తెలిపారు. –మాదాపూర్

ముగిసిన గ్లోబల్ డైవర్సిటీ...

సాక్షి, సిటీబ్యూరో: కార్పొరేట్ ఉద్యోగుల ఉద్యోగం ,సామాజిక సేవ తదితర అంశాలపై నగరంలోని మాదాపూర్‌లో ఉన్న ప్రముఖ ఆర్థిక సేవల సంస్థ సింక్రోనీలో నిర్వహించిన ఇండియా గ్లోబల్ డైవర్సిటీ ఎక్స్‌పీరియన్స్ సదస్సు గురువారం ముగిసింది. ఈ కార్యక్రమంలో నెట్‌వర్కింగ్ అవకాశాలు, కమ్యూనిటీ సర్వీస్ వర్క్‌షాప్ తదితర అంశాలపై ప్యానెల్ చర్చలు జరిగాయి. ప్రముఖ ఎన్‌జీఓ యంగిస్తాన్ ఫౌండేషన్ భాగస్వామ్యంతో పట్టణ మురికివాడలలో నివసించే పాఠశాల విద్యార్థుల కోసం ఎడ్యుకేషన్ కిట్స్ రూపొందించారు. ఈ కిట్‌లలో స్కూల్ బ్యాగ్‌లు, వాటర్ బాటిళ్లు, స్టేషనరీ బాక్సులు, స్నాక్ బాక్స్‌లు, నోట్‌బుక్‌లు, న్యూట్రిషన్ బార్‌లు వంటివి ఉన్నాయి. కార్యక్రమంలో మాజీ ఆర్మీ అధికారి, ప్రొఫెషనల్ మేజర్ వందనా శర్మ కీలకోపన్యాసం చేశారు. సింక్రోనీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ గౌరవ్ సెహగల్ తదితరులు మాట్లాడారు.

45 రోజుల పసికందుకు అరుదైన శస్త్రచికిత్స



సమావేశంలో పాల్గొన్న డాక్టర్లు, తల్లిదండ్రులు

మాదాపూర్: నాలుగు రోజులుగా పొత్తికడుపు వాపు, వాంతులతో బాధపడుతున్న 45 రోజుల పసికందుకు మెడికవర్ ఉమెన్, చైల్డ్ హాస్పిటల్ వైద్యులు అరుదైన శస్త్రచికిత్స చేశారు. దీనికి సంబంధించిన వివరాలను గురువారం విలేకరుల సమావేశంలో డాక్టర్లు వెల్లడించారు. డాక్టర్ మధుమోహన్‌రెడ్డి మాట్లాడుతూ పరీక్షల్లో శిశువు మూత్రవ్యవస్థ, వెన్నుముక, జననేంద్రియ ప్రాంతానికి సంబంధించిన సమస్య ఉందని దీన్ని యోనిఅట్రిసియా అంటారని తెలిపారు. సిస్టోస్కోపి ద్వారా చిన్న కెమెరాను ఉపయోగించి లాపరోటమీ సర్జరీ ద్వారా పేరుకుపోయిన ద్రవాలను తొలగించినట్టు తెలిపారు. 5గంటల పాటు శస్త్రచికిత్స చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో గైనకాలజిస్ట్ డాక్టర్ వరలక్ష్మి, డాక్టర్ జనార్దన్‌రెడ్డి, పీడియాట్రిక్స్ విభాగం అధిపతి డాక్టర్ రవీందర్ రెడ్డి, డాక్టర్ జనార్దన్‌రెడ్డి, డాక్టర్ సంధ్య, హర్షిత తదితరులు పాల్గొన్నారు.

'మనూ'లో ఎంఏ అరబిక్‌లో ప్రవేశాలు

ఆన్‌లైన్‌లో దరఖాస్తుల సమర్పణకు జూన్ 30 ఆఖరు

రాయదుర్గం: మనూలో అరబిక్ విభాగంలో పోస్టు గ్రాడ్యుయేట్ కోర్సులో చేరడానికి జూన్ 30వ తేదీ వరకు ఆన్‌లైన్లో దరఖాస్తు చేయాలని అరబిక్ విభాగం అధిపతి ప్రొఫెసర్ అలీమ్ అష్రఫ్ జైసీ గురువారం తెలిపారు. హైదరాబాద్ క్యాంపస్‌లో 60సీట్లు అందుబాటులో ఉండగా లక్నో క్యాంపస్‌లో 30 సీట్లు ఉన్నాయన్నారు. స్థానికేతర విద్యార్థులకు హాస్టల్ వసతి పరిమిత సామర్థ్యంతో ఉంటుందన్నారు .మరిన్ని వివరాలకు.. డాక్టర్ ముఫ్తీ మహ్మద్ షరాఫే ఆలమ్– 9705610569, డాక్టర్ ఆసిఫ్ లాయిక్–8801589585లో సంప్రదించాలని సూచించారు.

పాఠశాలల్లో మరమ్మతు పనులు త్వరితగతిన పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ క్రాంతి
- కర్దనూర్, ఘనాపూర్, రుద్రారం ప్రభుత్వ పాఠశాలల తనిఖీ



రుద్రారం ప్రభుత్వ పాఠశాలలో అధికారులకు సూచనలు ఇస్తున్న కలెక్టర్ క్రాంతి

పటాన్‌చెరు/ పటాన్‌చెరు టౌన్: అమ్మ ఆదర్శ పాఠశాలల్లో మరమ్మతు పనులను త్వరితగతిన పూర్తిచేయాలని కలెక్టర్ క్రాంతి వల్లూరు అధికారులను ఆదేశించారు.గురువారం పటాన్‌చెరు మండలం కర్దనూర్, ఘనాపూర్, రుద్రారం ప్రభుత్వ పాఠశాలలను కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల్లోని వంట గదులు, అంగన్‌వాడి కేంద్రాలను పరిశీలించారు.ఎగ్జిక్యూటివ్ ఏజెన్సీలతో అమ్మ ఆదర్శ పాఠశాలల్లో చేపట్టిన పనులను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... తాగునీటి సౌకర్యం, టాయిలెట్స్, ఎలక్ట్రిసిటీ, పెయింటింగ్, బెంచీలు, గ్రీన్ చాక్ బోర్డు, మేజర్, మైనర్ మరమ్మతులను త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. పనులు నాణ్యతగా ఉండాలన్నారు. ఆ బాధ్యత విద్యాశాఖ అధికారులదేనని తెలిపారు. పాఠశాలల్లో తలుపులు, కిటికీలు, ఫ్లోరింగ్ తదితర వాటిని రిపేర్ చేయించుకోవాలని అన్నారు. నీటి సమస్య రాకుండా స్టీల్ ట్యాంకులను ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రహరీ గోడలు దూకకుండా కంచెలను అమర్చాలని తెలిపారు. పాఠశాల ఆవరణలో శుభ్రత పాటించాలన్నారు. చదువుతో పాటు ఆటలకు ప్రాధాన్యత ఇవ్వాలని విద్యాశాఖాధికారులను ఆదేశించారు. రుద్రారం జడ్పీహెచ్‌ఎస్ ఉన్నత పాఠశాలలో చేపట్టవలసిన పనులకు దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ మనోజ్ , పంచాయితీరాజ్ ఈఈ సురేష్, తహసీల్దార్ రంగారావు ,ఎంపీడీఓ యాదగిరి ,ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.